క్లుప్తంగా

నేడు నాలుగేళ్ల సంబరాలు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ కొణతాల సుధ తెలిపారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాలతో మంగళవారం ఉదయం 9 గంటలకు జరగనున్న కార్యక్రమంలో వార్డు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కార్పొరేటర్ సుధ పిలుపు నిచ్చారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎచ్చెర్ల క్యాంపస్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా మరొకరు క్షేమంగా బయటపడ్డారు. అల్లినగరం జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో విశాఖ అర్బన్‌కు చెందిన రాపర్తి వెంకటసత్య రాఘవేంద్ర (39) ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు. వెంకటసత్య రాఘవేంద్రతో పాటు మరో వ్యక్తి శ్రీకాకుళంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో వంటలు చేసిన తరువాత తిరిగి ద్విచక్ర వాహనంపై విశాఖకు వెళ్తున్నారు. అల్లినగరం జంక్షన్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెంకటసత్య రాఘవేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. వెనుక కూర్చున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డారు. ఆధార్ కార్డు, వెనుక కూర్చున్న వ్యక్తి సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచాన్ని కలవరపెడుతున్న ధూమపానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: ఈ నెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస ఫౌండేషన్, గాంధీ సెంటర్ రూపొందించిన వరల్డ్ నో టు టొబాకో వాల్‌పోస్టర్‌ను సోమవారం బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఆచార్య బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానంతో ఏటా సుమారు 10 లక్షల మంది చనిపోతున్నారని, ప్రస్తుతం ప్రపంచాన్ని అది కలవరపెడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అలవాటు సరదాగా ప్రారంభమై ప్రాణం పోయే వరకు ఉంటుందన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పొగ లేని పొగాకు అంటే పాన్, గుట్కా వినియోగదారులు కూడా క్యాన్సర్ బారినపడుతున్నారన్నారు. ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదని పేర్కొన్నారు. ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యమూర్తి, ఆచార్య రామకృష్ణారావు, ఆచార్య హరినారాయణ, డాక్టర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు సబ్బవరం కేజీబీవీ ఎస్‌వో మృదుల తెలిపారు. ఏడాది కాలపరిమితితో భర్తీ చేయనున్నట్టు పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి వారు ఏపీ కేజీబీవీ వెబ్ సైట్‌లో వచ్చే నెల 4వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్లు, ఎస్సీ,ఎస్టీ,బీసీలకు 5 సంవత్సరాలు,మాజీ సైనిక ఉద్యోగులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు ఉంటుంది. వెబ్‌సైట్‌లో జిల్లాల వారీగా సబ్జెక్టు పోస్టులు, రోస్టర్ వారీగా ఖాళీలు తెలుసుకోవాలని పేర్కొన్నారు.

రోడ్లు తవ్వేశారు... సగమే పూడ్చారు!

- రెండు నెలలుగా అదే పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



మల్కాపురం ప్రధాన సర్వీసు రోడ్డులో గోతులను సరిగ్గా పూడ్చని దృశ్యం

మల్కాపురం: భూగర్భ పైపులైన్ కోసం రెండు నెలల కిందట పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన మార్గాల్లో గోతులు తవ్వారు. పనులు పూర్తయినా నేటికీ సరిగ్గా పూడ్చలేదు. బీటీ రోడ్డు వేయలేదు. దీంతో వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మల్కాపురం సమీపంలోని ఇండియన్ కోస్టుగార్డు ప్రధాన కార్యాలయానికి, కోస్టుగార్డు ఉద్యోగుల క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారి నీటి అవసరాల కోసం రెండు నెలల కిందట జింక్ నుంచి కోస్టుగార్డు ప్రధాన కార్యాలయం వరకు తొమ్మిది కోట్ల రూపాయిలతో భూగర్భ పైపులైన్లు ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా జింక్ నుంచి కోస్టుగార్డు వరకు గల సర్వీసు రోడ్డు మధ్యలో యంత్రాల సాయంతో గోతులు తవ్వారు.పైపులైన్ వేశారు. తవ్విన గోతులను సరిగ్గా పూడ్చడం కాంట్రాక్టర్ మరిచాడు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి గోతుల్లో వేసిన మట్టి కుంగిపోయింది. దీంతో ఒక చోట దిబ్బల మాదిరిగా, మరో చోట గోతుల మాదిరిగా ఉంది. అసలే ఈ మార్గంలో లైట్లు సరిగ్గా వెలగక పోవడంతో రాత్రి సమయంలో ప్రయాణాలు సాగించే వాహనదారులు, పాదచారులు ఆ గోతులను గుర్తించలేక గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు దీనిపై స్పందించి గోతులను సరిగ్గా పూడ్చడంతో పాటు బీటీ రోడ్డు వేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



శ్రీహరిపురం సర్వీసురోడ్డులో...

ఎప్పటికి పూడ్చుతారో..



మల్కాపురం నుంచి జింక్ వరకు సర్వీసురోడ్డులో తవ్విన గోతులు సరిగ్గా పూడ్చలేదు. దీంతో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి.రాత్రి సమయంలో ఈ మార్గన వచ్చే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.ముఖ్యంగా చిన్నారులు,వృద్ధులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు.

– శీర చిన్నాజీయాదవ్, మల్కాపురం

ద్విచక్ర వాహనం దిగబడింది



మల్కాపురం నుంచి గాజువాక వైపు ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి సమయంలో వెళ్తున్నాను.పైపులైన్ కోసం తవ్విన గోతులు సరిగ్గా పూడ్చకపోవడంతో మల్కాపురం వద్ద ఏర్పడిన గోతిలో నా ద్విచక్ర వాహనం దిగబడింది.అదృష్ట వశాత్తు ఏమీ జరగలేదు.

– కాకర ప్రకాష్, ద్విచక్ర వాహనదారు

కనులపండువగా అమ్మవార్ల తిరువీధి ఉత్సవం



రామాలయం నుంచి అమ్మవారి చిత్రపటాలు, ప్రభలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు



ప్రవచిస్తున్న బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల ప్రారంభ వేడుకలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 29న ప్రారంభమైన ఉత్సవాలు 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామకమిటీ ఆధ్వర్యంలో సోమవారం తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల చిత్రపటాలు, ప్రభలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, పూజలు చేశారు. ఆలయాల వద్ద హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. పరిసరాల్లో మహిళల కోలాటం, కళాకారుల సాము గరిడీ ఆకట్టుకున్నాయి.

దేవీ వైభవంపై ప్రవచనాలు

అమ్మవార్ల నూతన ఆలయం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి శ్రీ శృంగేరి శారద పీఠం ఆస్థాన పౌరాణికులు, ప్రవచన నిధి శ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి విచ్చేశారు. దేవీ వైభవంపై ఆయన ప్రవచనాలు ఆహుతులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట అర్చకులు పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్'పై పోటీలు



డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ సంస్థలు సంయుక్తంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీలు నిర్వహించాయి. 'సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై జరిగిన డ్రాయింగ్, ఎలక్యూషన్, క్విజ్ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఏయూ పర్యావరణ విభా గం ఆచార్యుడు ఇ.యు.బి. రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచానికి ఎంతో చేటుగా మారిందని వివరించారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ కార్ప్స్ విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ బాబూరావు, సెయింట్ జోసెఫ్ కళాశాల లెక్చరర్ మేరీ అనుపమ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ శ్రీలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్ వలంటీర్లు వి.కిరణ్మయి, ఎంజలీన్ భాస్కర్, జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎంకు సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కల్లూరి శ్రీనివాసరావును ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ నెలాఖరున శ్రీనివాసరావు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నాయకులు ఉక్కు పరిపాలన భవనంలో సోమవారం ఆయనను కలిసి, సత్కరించారు. స్టీల్‌ప్లాంట్‌లో కనిష్ట స్థాయిలో చేరి, అంచెలంచెలుగా చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగిన తీరు ను ప్రశంసించారు. ఉద్యోగుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తన విధి నిర్వహణలో సహకరించిన సహోద్యోగులు, కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న, మోహన్‌బాబు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు

మహారాణిపేట : ఆర్టీసీలో పనిచేసి రిటైర్ అయిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖ రీజియన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. భానుబాబు డిమాండ్ చేశారు. డిపోల్లో డ్రైవర్, కండక్టర్, మెకానిక్, హెల్పర్‌గా పనిచేసి రిటైర్ అయ్యామని, తాము వివిధ సమస్యలతో సతమతమౌతున్నామని, వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ సెటిల్‌మెంట్ చేయాలని, ఈపీఎఫ్ పెన్షన్ చాలా మందికి రావడం లేదని, రిటైర్ అయిన వారందరికీ పింఛను ఇవ్వాలని కోరారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

సీఎంఏ కోర్సుతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ కృష్ణమాచారి

సీతంపేట: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్‌కు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. 2023 నుంచి 27 వరకు తొమ్మిది మందితో ఎగ్జిక్యూటివ్ బాడీ ఏర్పాటైంది. పి.బి.కృష్ణమాచారి చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా యు.లక్ష్మణరావు, కార్యదర్శిగా జి.రామచంద్రారెడ్డి, హిమబిందు కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చైర్మన్ కృష్ణమాచారి మాట్లాడుతూ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్(సీఎంఏ) కోర్సుతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రస్తుతం సంస్థలో 800 మంది సీఎంఏ విద్యార్థులు ఉన్నారని, ప్రతి ఏటా 300 నుంచి 600 మంది ఈ కోర్సులో చేరుతున్నారని చెప్పారు. వారికి అవసరమైన అన్ని సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో తరగతులు, ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎంఏ కోర్సు పూర్తి చేసిన వారికి పబ్లిక్ సెక్టార్‌లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మణరావు, కార్యదర్శి జి.రామలింగారెడ్డి, కోశాధికారి హిమబిందు, సభ్యులు శిరీష, నరేంద్ర, వెంకటేష్, సంపత్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రా లు అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గాజువాకలో పాఠశాలల విలీనానికి వినతి

అక్కిరెడ్డిపాలెం: అగనంపూడి రెవెన్యూ పరిధి, పరవాడ మండల విద్యాశాఖ పరిధిలోని పినమడక, లేమర్తి జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు మరో 6 ఎంపీపీ పాఠశాలలను గాజువాక మండలంలో విలీనం చేయాలని అగనంపూడి అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు విశాఖ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విన్నవించడంతో ఆయన పాఠశాలల విలీనంపై ఇన్‌చార్జి డీఈవోకు లేఖను రాశారు. దీంతో పాటు అగనంపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్‌సీసీని కొనసాగించేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నగర ఉపాధ్యక్షుడు సాలాపు అచ్చిబాబు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- జెడ్సీ ఆర్జీవీ కృష్ణ



అర్జీదారుల సమస్యవింటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: వివిధ సమస్యలపై ప్రజలు అందిస్తున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జెడ్సీ ఆర్జీవీ కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలోసోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 08 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ కృష్ణ వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 02, యూసీడీ విభాగానికి 01, రెవెన్యూ విభాగానికి 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు.వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరత్‌కుమార్, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ యూసీడీ కె.శైలజ, సీడీవో పద్మావతి, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలతో వ్యక్తిత్వ వికాసం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రచయిత సత్తిరాజు

మల్కాపురం: మంచి గుణాలను అలవర్చుకొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని రచయిత కె.సత్తిరాజు అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిత్వం ఉన్నతంగా ఉన్నప్పుడే ప్రజల నుంచి గౌరవం లభిస్తుందని అన్నారు. ప్రేమించడానికి హృదయం ఉంటే చాలని,కానీ ప్రేమించబడడానికి ఉన్నత వ్యక్తిత్వం అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు ఆట పాటలు ,నాటక ప్రదర్శన వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి ఎన్ఎస్ఎస్ వలంటీర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న మహిళా సంఘం నాయకులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణకు ఒప్పుకోమని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేస్తున్న దీక్షలు 788వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు ఐద్వా విశాఖ జిల్లా కమిటీ సభ్యులు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలు వీడకపోతే మోడీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎ.పుష్పాంజలి సాహు, కె.లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమాలు



దీక్షలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమని స్పష్టం చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 837వ రోజు సోమవారం ఎంఎంఎస్ఎం మరియు ఎస్‌టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోబోమన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైనా విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.